క్లుప్తంగా

రేపు వాహనాల వేలం

పీలేరు : పీలేరు సెబ్ స్టేషన్ పరిధిలో మద్యం అక్రమ రవాణా కేసుల్లో పట్టుబడిన మూడు ద్విచక్రవాహనాలకు గురువారం వేలం నిర్వహించనున్నట్లు సెబ్ సీఐ గురుప్రసాద్ తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు జరిగే వేలం పాటలో ఆసక్తిగల వారు పాల్గొనాలని ఆయన కోరారు. వివరాలకు స్థానిక సెబ్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

విధుల్లో నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే ఆగ్రహం

మదనపల్లె : మున్సిపల్ ఏఈ బండపల్లిశిరీషా విధుల్లో నిర్లక్ష్యం కనపరచడంపై ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలోని పారిశుధ్య స్థితిగతులు, తాగునీటి సరఫరాపై సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరగడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు అధికమైన నేపథ్యంలో ఎన్విరాన్‌మెంటల్ ఏఈ శిరీషాను ఎమ్మెల్యే వివరణ కోరారు. గతంలో జరిగిన సమావేశంలో వార్డులవారీగా శానిటేషన్ సెక్రటరీలను సమన్వయం చేసుకుని పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేయాలని ఆదేశించినప్పటికీ నిర్లక్ష్యం వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలో కీలక అధికారిగా ఉంటూ ప్రజాసమస్యలపై ఉదాసీనత కనపరచడమేంటన్నారు. పనితీరు మెరుగుపరచుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. పనిచేయలేకపోతే సెలవుపై వెళ్లాల్సిందిగా ఆదేశించారు.

శబరిమలకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: శబరిమలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ టు డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. భక్తులకు కావాల్సిన రూటులో ,కావాల్సినన్ని రోజులు అద్దెకు ఇస్తామన్నారు. కేరళలో మన బస్సులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక పార్కింగ్ కలదన్నారు. కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో ఎలాంటి ఆర్టీవో పన్నులు లేవన్నారు. 7 మందికి (వంట మనుషులు,మణికంఠస్వామి, అటెండరు)లకు ఉచిత ప్రయాణం ఉంటుందన్నార. అనుభవం కలిగిన డ్రైవర్లు, సౌకర్యవంతమైన బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. అవకాశాన్ని అయ్యప్ప భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హెచ్‌ఐవీ నివారణపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న ఐసీటీసీ కౌన్సిలర్ లోకేష్

వాల్మీకిపురం: హెచ్‌ఐవీ/ఎయిడ్స్ నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసీటీసీ కౌన్సిలర్ లోకేష్ అన్నారు. మంగళవారం స్థానిక గాంధీబస్టాండ్‌లో ప్రజలకు ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఐవీ నాలుగు రకాలుగా వ్యాపిస్తుందన్నారు. అక్రమ లైంగిక సంబంధాలు, కలుషిత సూదులు, సిరంజీలు, కలుషిత రక్తమార్పిడి, హెచ్‌ఐవి ఉన్న తల్లి నుండి బిడ్డకు వ్యాప్తి చెందుతుందన్నారు. కార్యక్రమంలో లతాంజలి, అలివేలు, శోభ, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లు పంపిణీ



మూడు చక్రాల సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఉదయమోహన్‌రెడ్డి

మదనపల్లె సిటీ: స్థానిక అమ్మచెరువుమిట్టవద్ద నున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో మంగళవారం న్యూక్రాంతి దివ్యాంగుల యూత్ వెల్ఫేర్ సొసైటీ ఇంతియాజ్ దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లు పంపిణీ చేశారు. వెంకటనారాయణ, నియాన్‌ఖాన్, షేక్ షాకీర్‌లకు మూడు చక్రాల సైకిళ్లను వెలుగు కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి అందజేశారు.

'ఆడుదాం ఆంధ్ర'కు రిజిస్ట్రేషన్ చేసుకోండి

కేవీపల్లె : డిసెంబర్ 15 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు నిర్వహించనున్న 'ఆడుదాం ఆంధ్ర' ఆట పోటీలకు ఆసక్తిగల వారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎంపీడీఓ కె. ఉపేంద్రరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 15 సంవత్సరాలు పైబడిన వారు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్‌లో పోటీలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఆడుదాం ఆంధ్ర వెబ్‌సైట్‌లో గానీ, గ్రామ సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని తెలిపారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కలికిరి: ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ అన్నారు. మునెళ్ళపల్లి గ్రామ సచివాలయంలో మంగళవారం వై ఏపీ నీడ్ జగన్ కార్యాక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, రెడ్డెప్ప, ఎంపీటీసీ సభ్యురాలు షాహీనా, ఇనాముల్లా, జవహర్, మునాఫ్, సుధాకర్ రెడ్డి, షమీంపీర్, రసూల్‌సాబ్ పాల్గొన్నారు.

సంక్షేమ పాలన చూసి మద్దతివ్వండి

ఎమ్మెల్యే నవాజ్‌బాషా



ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే బ్రోచర్స్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : అవినీతికి తావులేకుండా రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాల్సిన అవసరం అందరిపై ఉందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. మంగళవారం మండలంలోని బసినికొండ-1, మున్సిపాలిటీలోని 10వవార్డు నిమ్మనపల్లె రోడ్డు, 4వవార్డు రామారావుకాలనీ-2 సచివాలయాల పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సచివాలయాల్లో వివిధ పథకాల రూపంలో ప్రజలకు అందించిన లబ్ధిని తెలిపే వివరాలతో కూడిన సంక్షేమ పథకాల డిజిటల్‌బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ... ప్రభుత్వ పాలనను ప్రజల ముంగిటకు తీసుకురావడంతో పాటు సంక్షేమ ఫలాలను అందరికీ అందజేస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. రాష్ట్రానికి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం ఎందుకు అవసరమో, వైఎస్సార్ సీపీ నాలుగన్నరేళ్ల పాలనలో ప్రజలకు ఏ మేలు కలిగిందో వివరించేందుకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పేద,బడుగు, బలహీనవర్గాల ప్రజల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. స్థానిక మండల నాయకులు, గ్రామపెద్దలతో కలిసి ఆయా వార్డుల్లోని ప్రధాన కూడళ్లలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. రాష్ట్రంలో అమలవుతున్నన్ని సంక్షేమ పథకాలు దేశంలో మరెక్కడా అమలుకావడం లేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలన యావత్ భారతదేశంలోనే సంచలనం సృష్టించిందని, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, విద్య, వైద్యం, వ్యవసాయరంగాల్లో తీసుకువచ్చిన విప్లవాత్మక సంస్కరణలను ప్రతి ఒక్కరూ ప్రశంసిస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల లబ్ధిని అందిస్తున్న ప్రభుత్వం వైఎస్సార్ సీపీనే నన్నారు. చంద్రబాబు నేడు ఏవేవో మాయమాటలు చెప్పి ప్రజలను మరోసారి మోసగించాలని చూస్తున్నారన్నారు. ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా చెప్పుడుమాటలు నమ్మవద్దని, ప్రజలకు మంచి చేసిన మనసున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరమణ, కౌన్సిలర్ సుగుణ, మున్సిపల్ వైస్ చైర్మన్ జింకాచలపతి, మండల కన్వీనర్ దండుకరుణాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పోతబోలునాగరాజ, బావాజీ, మునిశేఖర్, బావాజాన్, గుండ్లూరురఫీ, ఆంజనేయులు, ఈశ్వర్‌నాయక్, రేణుక, వసీం, భాను తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

మదనపల్లె : అర్హతే ప్రామాణికంగా కుల,మత, రాజకీయపార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీదేనని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని సీటీఎం-2 పంచాయతీ రేగంటివారిపల్లె, దయ్యాలవారిపల్లె, కల్లేపల్లె, వంకవడ్డిపల్లె గ్రామాల్లో మంగళవారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. సర్పంచ్ బండపల్లిఈశ్వరమ్మ, ఆర్‌బీకే చైర్మన్ బండపల్లివెంకటరమణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి నాలుగన్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అన్నిప్రాంతాలు, అన్ని వర్గాల ప్రజలు బాగుండాలన్న సదుద్దేశంతోనే సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేకానేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. ఆయన ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థకు దేశవ్యాప్తంగా మంచి పేరుందన్నారు. గ్రామాల్లోని సచివాలయాలతో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే 2024లోనూ మళ్లీ వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు అనసూయ, భారతి, మురళీ, వెలుగుచంద్ర, జేసీఎస్ కన్వీనర్ పోతబోలు నాగరాజ, ఖాదర్, వార్డు మెంబర్లు ఈశ్వరయ్య, శ్రీనివాసులు, జాకీర్, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

కులగణనతోనే బీసీలకు న్యాయం

ఏపీ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

మదనపల్లె : జనాభా ప్రాతిపదికన కులగణన చేపట్టి, 50 శాతం రిజర్వేషన్ అమలుచేసినప్పుడే బీసీలకు న్యాయం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంఘాలతో సమావేశమై, భవిష్యత్ కార్యాచరణ రూపకల్పన కోసం రాయలసీమ పర్యటనలో భాగంగా మంగళవారం మదనపల్లెకు విచ్చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షులు సహజీవన్ బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు అయినప్పటికీ నేటికీ బీసీకులాల స్థితిగతుల్లో మార్పు రాలేదన్నారు. రాజకీయపార్టీలు బీసీలను కేవలం ఓటుబ్యాంకుగా వాడుకుంటూ, స్వప్రయోజనాలకు వాడుకుంటూ, కులాలు, మతాలు, ప్రాంతాలుగా విభజిస్తూ ఛిన్నాభిన్నం చేస్తున్నారన్నారు. బీసీల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజాప్రతినిధులు ఎన్నికల సమయంలో బీసీనని చెప్పి ఓట్లుదండుకుంటున్న ప్రజాప్రతినిధులు, ఎన్నికయ్యాక బీసీల గురించి చట్టసభల్లో కనీసం మాటవరసకైనా ప్రస్తావించకపోవడం దారుణమన్నారు. 1931లో జరిగిన కులగణన తర్వాత దేశంలో నేటికీ జరగకపోవడం దురదృష్టకరమన్నారు. బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనారిటీలను కలుపుకుని రాజ్యాధికారమే అంతిమలక్ష్యంగా, అన్ని వర్గాలకు న్యాయం జరగాలన్న ఆశయంతో త్వరలో రాజకీయ పార్టీ నిర్మాణానికి ప్రయత్నిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమసంఘం యువజన అధ్యక్షులు క్రాంతికుమార్, నాగరాజు, సిద్ధయ్య, శ్రీదేవి, మురళీ బీసీ కులాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆత్మహత్య ఆలోచన రానివ్వద్దు



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీధర్‌రెడ్డి

కురబలకోట: జీవితం విలువైనదని ఆత్మహత్య ఆలోచన రానివ్వద్దని డాక్టర్లు వై. శ్రీధర్ రెడ్డి, సుజయ్ అన్నారు. అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఎంఎస్ఆర్ క్లబ్ ఆధ్వర్యంలో ఆత్మహత్యల నివారణపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ జీవితంలో రాణించలేకపోవడం, విరక్తి, అప్పులు,నిరాశ, నిస్పృహ, ఒంటరితనం, మోసపోవడం, అనారోగ్యం, కలహాలు, అపార్థాలు, మానసిక, ప్రేమ విఫలం తదితర కారణాల వల్ల ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. సామాన్యుల నుండి సినీ తారలు, వ్యాపారులు, పేరు ప్రఖ్యాతలున్నవారు సైతం ఆత్మహత్యలతో జీవితాన్ని అర్థాంతరంగా కోల్పోతున్నారన్నారు. ఒకరు ఆత్మహత్య చేసుకుంటే ప్రత్యక్షంగా పరోక్షంగా 135 మందిపై ప్రభావం చూపుతుందని అమెరికన్లు చేసిన అధ్యయనంలో వెల్లడైందన్నారు. ఓడిపోవడం తప్పుకాదు.. అది జీవితంలో ఎదగడానికి ఓ మెట్టుగా భావించాలన్నారు. సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కానేకాదన్నారు. ఆత్మహత్య ఆలోచన వచ్చినప్పుడు దాన్ని వాయిదా వేసుకుంటే చాలామట్టుకు ఇవి తగ్గిపోతాయన్నారు. అందమైన జీవితంలో సమస్యల మామూలేనన్నారు. ధైర్యంగా ముందుకు సాగితే పరిస్థితులు చక్కబడతాయన్నారు.

బలహీనవర్గాల ఆశాజ్యోతి మహాత్మా పూలే



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మదనపల్లె : బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి, సామాజిక తత్వవేత్త, నవయుగ వైతాళికుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని నాయకులు అన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా పట్టణంలో పలుచోట్ల నివాళులు అర్పించారు. స్థానిక బాస్ కార్యాలయంలో వీసీకే పార్టీ- భారతీయ అంబేడ్కర్ సేన సంయుక్త నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో పీటీఎం.శివప్రసాద్ పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మనుస్మృతి విధించిన అనాగరిక ఆచారాలపై తుదిశ్వాస వరకూ పోరాడిన యోధుడు పూలే అన్నారు. మహాత్మాపూలే వాదమంటే మనుస్మృతిపై యుద్ధం చేయడమేనని అన్నారు. బహుజన సేన ఆధ్వర్యంలో స్థానిక చిత్తూరుబస్టాండ్ సర్కిల్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బాస్ జిల్లా కన్వీనర్ ముత్యాలమోహన్, మునివెంకటప్ప, టి.ఎ.పీర్‌బాషా, చాట్లబయన్న, రెడ్డెప్ప, రాయల్‌సూర్య, బహుజనసేన టౌన్ ఆటోయూనియన్ ప్రెసిడెంట్ రాఘవేంద్రయాదవ్, రూపకనాయక్, నవీన్‌నాయక్, మహేష్, చలపతి, అమర, విజయ్, గురుమూర్తి, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేశాం.. ఆదరించండి

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ఎంతో అభివృద్ధి చేశాం... వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆదరించాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని తలపుల పంచాయతీ మేకలవారిపల్లె, వడ్డిపల్లె, సూరయ్యగారిపల్లె, లేమాటివారిపల్లె, గాండ్లపల్లె, తలపుల, హరిజనవాడ తదితర గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. నాలుగేళ్ల పాలనలో ప్రభుత్వం ప్రజలకు అందించిన పథకాలు గూర్చి వివరించారు. గ్రామాల్లో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు నాయుడు తన కుటుంబ అభివృద్ధి చేసుకున్నారు, తప్ప రాష్ట్ర ప్రజల అభివృద్ధి గురించి విస్మరించారని తెలిపారు. గతంలో 600 హామీలు గుప్పించి అమలు చేసింది శూన్యమని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి పథకాలు యథావిధిగా కొనసాగాలంటే వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజల నుంచి వచ్చిన వివిధ సమస్యలు అప్పటికప్పుడే సంబంధిత అధికారులకు తెలియజేసి పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు శిరీష, జగన్‌మోహన్‌రెడ్డి, వెంకటరమణనాయుడు, అమరనాథరెడ్డి, మల్లికార్జున రెడ్డి, మస్తాన్, చక్రపాణిరెడ్డి, తిమ్మయ్య, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంపీడీఓ కార్యాలయంలో 'జగనన్నకు చెబుదాం'

మదనపల్లె : మదనపల్లె మండల ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భానుప్రసాద్ తెలిపారు. ఉదయం 9 గంటలకు జరిగే కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. మండలంలోని ప్రజలు తమ గ్రామాల్లోని సమస్యలపై కలెక్టర్‌కు నేరుగా అర్జీలు సమర్పించవచ్చన్నారు.

సాంబారు మీదపడి చిన్నారికి గాయాలు

మదనపల్లె: ప్రమాదవశాత్తూ సాంబారు మీద పడి చిన్నారి గాయపడిన సంఘటన మంగళవారం సోమల మండలంలో జరిగింది. అన్నెమగారిపల్లెకు చెందిన రవి కుమారుడు భార్గవ్ (4) ఉదయం ఇంట్లో తల్లి వంట చేస్తుండగా ఆడుకుంటూ వంటగదిలోకి వెళ్లాడు. అక్కడ ప్రమాదశాత్తూ స్టౌపై ఉన్న సాంబరు భార్గవ్ మీద పడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మా బిడ్డ మృతిపై సమగ్ర విచారణ చేయాలి

పోలీసుస్టేషన్ ముందు బాధితుల ధర్నా



నిరసన కారులతో చర్చిస్తున్న ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి

తంబళ్లపల్లె: మా బిడ్డ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని, పోలీసులు సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని ఏటిగడ్డపల్లెవాసులు డిమాండ్ చేశారు. మంగళవారం పోలీసుస్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఏటిగడ్డపల్లెకు చెందిన పాపులమ్మ కుమారుడు రవికుమార్ (24) ఆదివారం రాత్రి ములకలచెరువు రోడ్డు పక్కన అనుమానాస్పదస్థితిలో ఓ చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందాడు. సోమవారం సమాచారం అందుకున్న ములకలచెరువు సీఐ మధు, హెడ్‌కానిస్టేబుల్ శంకర్ సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతి సంఘటనపై మాకు అనుమానాలు ఉన్నాయని విచారణ చేసి న్యాయం చేయాలని మృతుని తల్లి పాపులమ్మ, ఏటిగడ్డపల్లె వాసులు పోలీసుస్టేషన్ ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. స్పందించిన ఎస్.ఐ లోకేష్‌రెడ్డి నిరసనకారులతో చర్చించారు. పోస్టుమార్టం నివేదిక రాగానే రిపోర్టు ఆధారంగా దర్యాప్తు చేసి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

బీఎల్‌ఏలను నియమించుకోవాలి

ఆర్డీఓ ఎం.ఎస్.మురళి



మాట్లాడుతున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి

మదనపల్లె : రాజకీయపార్టీల ప్రతినిధులు బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి కోరారు. మంగళవారం సబ్‌కలెక్టరేట్‌లో ఎన్నికలసంఘం ఆదేశాల మేరకు రాజకీయపార్టీల ప్రతినిధులు, ఏఈఆర్వో, సూపర్‌వైజర్స్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ... డిసెంబర్ 2, 3 తేదీల్లో ఓటర్స్ స్పెషల్ క్యాంపెయిన్ డే నిర్వహిస్తున్నామన్నారు. ఆయా రోజుల్లో బీఎల్వోలు పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండి కొత్త ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, ఇతరత్రాలపై దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. 18-19 సంవత్సరాల వయస్సున్న వారిని ఓటరుగా నమోదు చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మదనపల్లె నియోజకవర్గంలో జనాభా అంతరాలను పరిశీలిస్తే.. నాలుగు నుంచి ఐదు వేల వరకు ఓట్లు కొత్తగా చేర్చాల్సిన అవసరం ఉందన్నారు. కొత్తగా ఓటరున మోదుపై ప్రజలను చైతన్య పరిచేందుకు బుధవారం 9.30 గంటలకు సబ్ కలెక్టరేట్ నుంచి కృష్ణదేవరాయసర్కిల్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జింకాచలపతి, టీడీపీ మునిరత్నం, సుధాకర్, జనసేన జంగాలశివరాం, బీజేపీ మధు, ఆప్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వికసిత్‌భారత్ సంకల్పయాత్ర



వికసిత్ భారత్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి కృష్ణమూర్తి

రామసముద్రం: రామసముద్రం మండలంలోని పెద్దకురప్పల్లె పంచాయతీ, నారిగానిపల్లె పంచాయతీ మంగళవారం వికసిత్ భారత్ సంకల్పయాత్రను ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమానికి స్పెషల్‌ఆఫీసర్ కృష్ణమూర్తి హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలలో అవగాహన కల్పించారు. బీజేపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కృష్ణమూర్తి మట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజల కోసం కళ్యాణయోజన , గ్రామనివాస్‌లో ఇంటి ఇంటికి కొళాయి కనెక్షన్లు, ఉచిత గ్యాస్ కనెక్షన్లు, పీఎం క్రెడిట్ కార్డ్‌తో పోస్ట్ ఆఫీస్ ద్వారా బెనిఫిట్ సౌకర్యం కల్పించారన్నారు. పశుపోషణ క్రెడిట్ కార్డు , 17 రకాల కుల వృత్తిదారులకు బ్యాంకులో 50 పైసల వడ్డీతో రూ.2నుంచి 5 లక్షల వరకు రుణ సదుపాయం కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రెడ్డెప్పనాయుడు, నవనీత, పంచాయతీ అభివృద్ధి చైర్మన్ హరి, ఎంపీడీవో నారాయణస్వామి , ఈవోపీఆర్‌డి సుధాకర్‌రెడ్డి, ఏపీవో గౌరిశంకర్, డాక్టర్ నూరుల్లా, అంగన్‌వాడి, వైద్య సిబ్బంది , ప్రజలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



పీలేరు రూరల్ : సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న దృశ్యం



గుర్రంకొండ: శెట్టివారిపల్లె సచివాలయం వద్ద పార్టీ జెండా ఆవిష్కరణ

పీలేరు రూరల్ : అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా పథకాలు అమలు చేస్తున్నట్లు సర్పం దండు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గూడరేవుపల్లెలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయం వద్ద సంక్షేమ పథకాలు బోర్డు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబాన్ని ఆర్థిక పరిపుష్టి సాధించడమే లక్ష్యంగా పథకాలు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేష్, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు

గుర్రంకొండ: రాష్ట్రంలోని ప్రతి కటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడమే సీఎం జగన్మోహన్‌రెడ్డి ధ్యేయమని అని జెడ్పీటీసీ సభ్రీన్‌ముక్తియార్ అన్నారు. మంగళవారం మండలంలోని శెట్టివారిపల్లె సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలంటే అన్న కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సచివాలయం వద్ద జగనన్న ప్రభుత్వం గ్రామంలోని 986 కుటుంబాలకు ప్రభుత్వ పథకాల ద్వారా ఎంత మేరకు నిధులు ఇచ్చారో డిజిటల్ బ్యానర్ ద్వారా ప్రదర్శించారు. సచివాలయం దగ్గర వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ప్రభుత్వ పథకాల ద్వారా ఆయా పంచాయతీ పరిధిలోని ప్రజలకు ఎంతమేరకు నిధులు ఇచ్చారో చదివి వినిపించారు. మండల సచివాలయాల కన్వీనర్ నాగేంద్ర, మండల ప్రత్యేక ఆహ్వానితులు చంద్రశేఖర్, ఎంపీటీసీ సరస్వతి, మాజీ సర్పంచ్‌లు సూరి, కుమార్, పెద్దరెడ్డెప్ప, ,పంచాయతీ కార్యదర్శి కుసుమ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

జగనన్న పాలన దేశానికే ఆదర్శం

వాల్మీకిపురం: సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలన దేశంలోని ఇతర ఇతర రాష్ట్రాలకు సైతం ఆదర్శంగా నిలుస్తోందని సర్పంచ్ గంగులమ్మ, మండల పార్టీ అధ్యక్షులు నీళ్లభాస్కర్ అన్నారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సచివాలయం 1 పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనకు, మోసపూరిత వాగ్దానాలిచ్చే చంద్రబాబు గత పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని గమనించాలని ప్రజలకు తెలియజేశారు. గత చంద్రబాబు పాలనలో టీడీపీ సానుభూతిపరులకు మాత్రమే సంక్షేమ పథకాలు అందేవని, ప్రస్తుతం జగనన్న పాలనలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్, ఈవో ఉదయ్ కుమార్, ఈవోఆర్‌డి పాండురంగ, నాయకులు అబ్దుల్ కలీమ్, శ్రీధర్‌రాయల్, రాయుడు, ఆనంద, చికెన్‌మస్తాన్, రఘు, షాహెద్, సాధిక్, రవి, సాగుబడి ఆనంద రెడ్డి, మధనమోహన్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

మేలు జరగాలంటే మళ్ళీ జగనన్న రావాలి

ములకలచెరువు: ప్రతి కుటుంబానికి మేలు జరగాలంటే రాష్ట్రానికి మళ్ళీ జగనన్న సీఎం కావాలని ఎంపీపీ సాయిలీల, ఎంపీడీఓ అశ్విని అన్నారు. మంగళవారం ములకలచెరువు-2 లో వై ఏపీనీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సచివాలయంలో అభివృద్ధి, సమాచార డిజిటల్ బోర్డు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మాధవరెడ్డి, సర్పంచ్ మంజుల,నాయకులు రవీంద్రారెడ్డి, సిద్దారెడ్డి అధికారులు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నే సీఎం కావాలి

తంబళ్లపల్లె: రాష్ట్రంలో నిరుపేదల సంక్షేమం జరగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించాలని మండల అభివృద్ధి కమిటీ అ.ధ్యక్షులు నారాయణరెడ్డి కోరారు. మంగళవారం కుక్కరాజుపల్లెలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. వైఎస్సార్ సీపీ పతాకాన్ని, సంక్షేమం,అభివృద్ధి సమాచారం డిజిటల్ బోర్డు బుక్‌లెట్‌లను ఆవిష్కరించారు. నవరత్నాల పేరుతో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీదేనన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సురేంద్ర నాథ్, ఎంపీపీ అనసూయమ్మ, సింగల్ విండో చైర్మన్ భార్గవ్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చౌడేశ్వర్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వీసీకే పార్టీ సమావేశాన్ని జయప్రదం చేయండి

పీలేరు : వచ్చే నెల 4న నిర్వహించనున్న వీసీకే పార్టీ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి పాలకుంట శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానిక వీసీకే పారీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వీసీకే పార్టీ పోటీ చేయం విషయంపై, బహుజనులపై జరుగుతున్న దాడులను ఖండించడంపై, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై సమావేశం జరుగుతుందని తెలిపారు. డిశెంబర్ 4న జరిగే సమావేశానికి వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరు అవుతారని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు ముల్లంగి కృష్ణయ్య, గురునాథ, చౌడప్ప, వెంకటరెడ్డి, హరినాథ పాల్గొన్నారు.

సంగ్రహణాత్మక పరీక్షలు ప్రారంభం

మదనపల్లె సిటీ: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మదింపు చేసేందుకు నిర్వహించే సంగ్రహణాత్మక పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మదనపల్లె అర్బన్, మండల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఎస్ఏ-1 పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలు మంగళవారం నుంచి వచ్చే నెల ఎనిమిదో తేదీ వరకు నిర్వహించనున్నారు. ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థులకు బైలింగ్వల్ విధానంలో, పదో తరగతి విద్యార్థులకు మీడియం వారీగా ప్రశ్నాపత్రాలను అందజేశారు.